262) మంగళకైశిక

ప॥ ఇందాకా మాపని యిక నీపని । కందువాయ వలపులు కపట మేమున్నది ॥

చ॥ చేతులనె మొక్కిమొక్కి సెలవులనే నవ్వునవ్వి । ఆతలనే నిలచున్న దదివో చెలి ।
కాతరాన యికమీద గలిగిన పనులు నీ- । చేతి నింతె యిక నీతో చెప్పనేమి వున్నది ॥

చ॥ కన్నులనె నిన్నుజూచి కానుక నీకంది యిచ్చి । అన్నిటా గుట్టున నున్నదదివో చెలి ।
సన్నలూను మీలోని సరసాలు నిటమీద । పన్నుకో నీవెనేర్తువు పలుక నేమున్నది ॥

చ॥ మచ్చిక నీకు జేసి మనసు నీపై బెట్టి । యిచ్చట గాగలించె నిదివో చెలి ।
అచ్చపు శ్రీవేంకటేశ ఇట్టె నీవు గూడితివి । యిచ్చకము లిటమీద నిన్ని నెఱుగుదువు ॥